నమస్తే తెలంగాణ
నిజామాబాద్, మంగళవారం 7 జనవరి 2025
TUESDAY, JANUARY 7, 2025

## సంక్రాంతికి ప్రత్యేక బస్సు

బాన్సువాడ టౌన్, జనవరి 6 : సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ డిపో మేనేజర్ సరితాదేవి తెలిపారు. బాన్సువాడ నుంచి వింజమూరుకు ప్రతిరోజూ నడిపే సూపర్ లగ్జరీ బస్సుతోపాటు అదనంగా ఈ నెల 10, 12వ తేదీల్లో డీలక్స్ బస్సును నడపనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సు 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు, 12వ తేదీన సాయంత్రం 4 గంటలకు బాన్సువాడ బస్టాండ్ నుంచి బయల్దేరుతుందని తెలిపారు.

## 'బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి'

మాచారెడ్డి, జనవరి 6 : సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తోట బాల్‌రాజు అన్నారు. పాల్వంచలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 23 నుంచి 42 శాతానికి పెంచుతామని, బీసీ సంక్షేమ నిధి కోసం ఐదు సంవత్సరాల్లో రూ.లక్ష కోట్లు విడుదల చేస్తామని, వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ తరపున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పాల్వంచ మండలాధ్యక్షుడు పోసు అనిల్, రాఘవపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఆలయాల్లో చోరీ


ఆలయ తాళాన్ని పగులగొట్టిన దుండగులు

భిక్కనూరు, జనవరి 6 : మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఉన్న రెండు ఆలయాల్లో చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని దుండగులు ఆలయ తలుపులను ధ్వంసం చేసి అమ్మవారి ముక్కుపుడక, పుస్తె, మెట్టెలు, వెండి ఆభరణాలతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

బీబీపేట్, జనవరి 6 : విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు బీబీపేటలోని సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో బుధవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ఏఈ భాస్కర్ సోమవారం తెలిపారు. ఈ పరిష్కార వేదికకు వరంగల్ నుంచి విద్యుత్ ఉన్నతాధికారులు వస్తున్నట్లు పేర్కొన్నారు. బీబీపేట, దోమకొండ, భిక్కనూర్, రాజంపేట మండలాల విద్యుత్ వినియోగదారులు ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే పరిష్కార వేదికలో తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు.

## నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో సమీక్ష

బాన్సువాడ, జనవరి 6 : బాన్సువాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజాంసాగర్ ప్రాజెక్టు సీఈ శ్రీనివాస్, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ బలరాం, డీఈఈ జగదీశ్, శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ వరప్రసాద్, నీటిపారుదల శాఖ ఏఈలు పాల్గొన్నారు. బాన్సువాడలో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ కార్యాలయ ప్రారంభోత్సవం, అమృత్ 2.0లో భాగంగా పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభాస్థలిని వారు పరిశీలించారు.

# రూ.ఏడు కోట్ల మత్తు పదార్థాలు ధ్వంసం

పడకల్ శివారులో దహనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలు


మత్తు పదార్థాలను దహనం చేస్తున్న పోలీసులు

కామారెడ్డి రూరల్, జనవరి 6 : జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో పలు చోట్ల తనిఖీలు, దాడులు చేసి స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలను ధ్వంసం చేశామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి హన్మంత్‌రావు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ డివిజన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలోని వివిధ స్టేషన్లలో ఎండీపీఎస్ చట్టం ప్రకారం నమోదైన 71 కేసుల్లో నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి, అల్ప్రాజోలం, డైజోఫాం, గంజాయి మొక్కలు, జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలో ఉన్న మెడికల్ సర్వీసెస్ కెమికల్ ఫ్యాక్టరీలో దహనం చేసినట్లు చెప్పారు. 1,285.25 కేజీల ఎండు గంజాయి, 32.585 కేజీల అల్ప్రాజోలం, 71.845 కేజీల డైజోఫాం, 114 గంజాయి మొక్కల ధ్వంసం చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.7,98,70,250 ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్ కుమార్, మధుసూదన్ రావు, షాకీర్ హైమద్, సత్యనారాయణ, విక్రమ్ కుమార్, నగేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయికి ఎంపిక

మాచారెడ్డి, జనవరి 6 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామానికి చెందిన జడీపల్లి సునీల్‌రెడ్డి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్(రన్నింగ్) పోటీలో సత్తాచాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా క్రీడాసంఘం అధ్యక్షుడు రంజిత్‌మోహన్ తెలిపారు. ఐదు కిలో మీటర్లు, 800 మీటర్ల విభాగంలో రజత పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

## సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలి

రాజంపేట్, జనవరి 6 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ఎంపీడీవో రఘురాం, ఎంఈవో పూర్ణచందర్ రావు, ఏవో శృతి, ఏపీఎం సాయిలు, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ మొహినుద్దీన్, మిషన్ భగీరథ ఏఈ రజిత, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని, రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారని తహసీల్దార్ తెలిపారు.

**సర్వేను పరిశీలించిన ఎంపీడీవో**

బీబీపేట్, జనవరి 6 : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నది. మండలంలోని యాడారం గ్రామంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి సర్వే చేసి యాప్‌లో వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై ప్రమాదకరంగా గుంతలు


దోమకొండలోని బస్‌స్టాప్ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

బీబీపేట్(దోమకొండ), జనవరి 6 : దోమకొండ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకంగా మారాయి. దోమకొండలోని ప్రధాన రోడ్డు చెడిపోయి గుంతలు ఏర్పడినా ఆర్ అండ్‌బీ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దోమకొండ మండల కేంద్రంలోని ముత్యంపేట క్రాసింగ్, భారత్ గ్యాస్ ఆఫీస్ ఎదురుగా ఉన్న రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. బస్ స్టాప్ మూల మలుపు వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గ్రామ పంచాయతీ సమీపంలో, గొట్టిముక్కుల గ్రామానికి వెళ్లే రోడ్డు, దోమకొండ నుంచి బీబీపేటకు వెళ్లే రోడ్డులో అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారుల గుండా వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో ఈ దారులగుండా వెళ్లిన వారు ప్రమాదాలకు గురయ్యారని గ్రామస్తులు తెలిపారు. పెద్ద ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## స్వచ్ఛంద సంస్థను సందర్శించిన టీయూ విద్యార్థులు


మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

భిక్కనూరు, జనవరి 6 : తెలంగాణ విశ్వ విద్యాలయం దక్షిణ ప్రాంగణం సోషల్ వర్క్ విద్యార్థులు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా నిజామాబాద్‌లోని వర్క్ స్వచ్ఛంద సంస్థ ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ రాజేశ్ మాట్లాడుతూ.. సంస్థ చేపట్టిన కార్యకలాపాల గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, బాధితులు, వారి కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ విధానాలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ యాలాద్రి, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్/బిచ్కుంద/మద్నూర్, జనవరి 6 : బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన చింతకింది కళ్యాణికి మంజూరైన రూ.26వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నెర్రె నర్సింహులు, బోర్లం సొసైటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు పర్వంరెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, మన్నెచిన్న సాయిలు, గోపన్‌పల్లి సాయిలు, జలీల్, భరత్, నాగభూషణం, మన్నె రమేశ్, బేగరి సాయిలు తదితరులు ఉన్నారు. జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 30 మందికి, బిచ్కుంద మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో 64 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ కవిత, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు గోపాలరెడ్డి, విఠల్‌రెడ్డి, కేమ్‌రాజ్‌కల్లాలి మాజీ సర్పంచ్ రమేశ్‌దేశాయ్, సాయిని అశోక్ తదితరులు పాల్గొన్నారు. మద్నూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిపటేల్, హన్మాండ్లు స్వామి, సాయిలు, రాంపటేల్, ప్రజ్ఞకుమార్, శ్రీనుపటేల్, రమేశ్, అమూల్, రాములు, సచిన్, బాలు తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

## విద్యార్థులకు క్విజ్ పోటీలు


చద్మల్ తండా పాఠశాలలో క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన సంస్థ ప్రతినిధులు

గాంధారి, జనవరి 6: మండలంలోని చద్మల్ తండా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కౌమారదశలో జరిగే మార్పులపై క్విజ్ పోటీలు నిర్వహించారు. అంతకు ముందు పాఠశాలలోని 8,9,10వ తరగతి విద్యార్థులకు కౌమార దశలో జరిగే మార్పులపై వర్డ్ సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. బాలుర విభాగంలో ధరమ్‌సింగ్ , కేవల్‌సింగ్ , ఎం.శ్రీను , బాలికల విభాగంలో రోజా, ప్రియాంక, అశ్విని విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, వర్డ్ సంస్థ ఎంసీ రాణి, సీసీ యాదగిరి , ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి'కి అధికారుల డుమ్మా

నిజాంసాగర్, జనవరి 6 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కొందరు అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజావాణి కార్యక్రమంలో తప్పకుండా ప్రతి ఒక్క అధికారి పాల్గొనాలనే ఆదేశాలు ఉన్నా తమకేమీ పట్టనట్లు కొందరు అధికారులు డుమ్మా కొట్టడంపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఐకేపీ ఏపీఎం, అంగన్‌వాడీ అధికారులే తప్ప మిగతా శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. వీరిపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజావాణికి ఫిర్యాదులు రాకపోవడంతోనే పలు శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నట్లు సమాచారం. ఇకనైనా జిల్లా అధికారులు చర్యలు తీసుకొని అన్ని శాఖల అధికారులు ప్రజావాణిలో పాల్గొనేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సీఐటీయూ జెండా ఆవిష్కరణ

బిచ్కుంద, జనవరి 6 : అంగన్‌వాడీ యూనియన్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఏర్పడిన రోజు సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్‌గొండ, సభ్యులు శారద, లక్ష్మి, రుక్మిణి, శకుంతల, సాయిలు, రూప్‌సింగ్, పరశురాం పాల్గొన్నారు.

## చేపల దాణా యూనిట్ నెలకొల్పుతాం

లింగంపేట, జనవరి 5: మండలంలోని బాయంపల్లి గ్రామాన్ని సెర్ప్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు సోమవారం సందర్శించారు. గ్రామంలో చేపల దాణా యూనిట్ నెలకొల్పనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామానికి చెందిన స్వయం సహాయక సభ్యురాలు కుంట యశోద చేపల దాణా తయారీ చిన్న యూనిట్‌ను నెలకొల్పారు. గత శుక్రవారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ గ్రామాన్ని సందర్శించిన సమయంలో కుంట యశోద దాణా అధిక మొత్తంలో తయారీ కోసం అధునాతన దాణా తయారీ యూనిట్ ఏర్పాటుకు ఏడు లక్షల రూపాయల రుణం మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సెర్ప్ ఏపీఎం చామంతి శ్రీనివాస్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఆర్ముగం, ఫీల్డ్ అధికారి మనోహర్ యూనిట్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. యూనిట్ ఏర్పాటుకు రుణం మంజూరు చేయనున్నట్లు బ్యాంకు అధికారులు వెల్లడించారు. అనంతరం ఫిష్ పాండ్ యూనిట్‌ను పరిశీలించారు.

# విద్యార్థిని చితకబాదిన టీచర్

## పాఠశాల యాజమాన్యంపై కేసు


కందిపోయిన చేతులు

నాగిరెడ్డిపేట, జనవరి 6: మండల కేంద్రం గోపాల్‌పేటలోని ఓ పాఠశాల విద్యార్థి రిత్విక్(7)ను ఉపాధ్యాయురాలు చితక బాదడంతో సోమవారం తల్లితండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన మేకల నర్సింహులు కుమారుడు రిత్విక్ స్థానిక ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన కొడుకు రిత్విక్ చేతులు, తొడలపై దెబ్బలతో ఎర్రగా వాచిపోయి ఉండడాన్ని చూసిన తల్లి మానస విషయాన్ని భర్తకు ఫోన్ ద్వారా తెలిపింది. ఇంటికి చేరుకున్న నర్సింహులు కొడుకును అడగగా పాఠశాలలో జుహ్లి అనే ఉపాధ్యాయురాలు టెస్టు పెట్టగా తాను మంచిగా రాయలేదని, చేతిలో ఉన్న స్టిక్‌తో కొట్టినట్లు చెప్పాడు. దీంతో రిత్విక్‌ను ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయురాలు జుహ్లి, పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. విద్యార్థిని చికిత్స కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

# అగ్రి కళాశాలను తరలించవద్దంటూ వినతి


నాగిరెడ్డిపేట డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగిరెడ్డిపేట, జనవరి 6: మండలంలోని మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను తరలిస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య అన్నారు. స్థానిక రాంప్రతాప్ టాకీస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలనే సదుద్దేశంతో 2017లో విత్తనక్షేత్రం భూమిలో నుంచి 25 ఎకరాలను కేటాయించి రూ. కోట్లు వెచ్చించి భవనాలు, సౌకర్యాలు కల్పించిందన్నారు. ఇప్పుడు అధికారుల తప్పుడు సమాచారంతో తక్కువ మంది విద్యార్థులను చూపి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ నాయకులు కళాశాల తరలకుండా అడ్డుకోవాలన్నారు. కళాశాల తరలిస్తే ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడ్తామని హెచ్చరించారు. అనంతరం ర్యాలీగా తహసీల్ కార్యాలయం చేరుకొని డీటీ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఫరీద్, లక్ష్మీకాంతం, వంశీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం


అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సదాశివనగర్ సీఐ సంతోష్, ఎస్సై ఆంజనేయులు

గాంధారి, జనవరి 6: మండలంలోని సీతాయిపల్లి అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఉన్న మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సీతాయిపల్లి గ్రామ శివారులోని అడవిలో బామన్‌కుంట సమీపంలోని ఎత్తుగడ్డపై, చెట్టుకు తాడుతో ఉరేసుకొని, వేలాడుతున్న మృతదేహాన్ని ఫారెస్టు బీట్ అధికారి బిలాల్‌వార్ రవి గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన సదాశివనగర్ సీఐ సంతోష్‌గౌడ్, ఎస్సై ఆంజనేయులు మృతదేహాన్ని పరిశీలించారు. 20 నుంచి 25 రోజుల క్రితం వ్యక్తి మృతిచెందాడని, మృతుడి వయస్సు దాదాపు 40 నుంచి 45 ఏండ్లు ఉంటుందన్నారు. మృతుడు ఒంటిపై ఆకుపచ్చ, తెలుపు రంగు టవల్, నీలి, తెలుపు రంగు లైనింగ్ షర్ట్, బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహంపై ఉన్న బట్టలను గుర్తుపడితే 8712686165, 8712686163 నంబర్లకు సమాచారం ఇవ్వాలని వారు సూచించారు.

మోడల్ స్కూల్‌లో
## ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజాంసాగర్, జనవరి 6 : మండలంలోని అచ్చంపేట ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025–26లో ఆరో తరగతి నుంచి పదోతరగతి ప్రవేశాలకు జనవరి 6 నుంచి ఫిబ్రవరి 25 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష హాల్ టికెట్లు ఏప్రిల్ 3వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 6వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 13న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రైవేట్‌కు ధీటుగా ర్యాంకులు సాధించాలి

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 6: ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మంచి ర్యాంకులు సాధించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ విద్యార్థులతో అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో 33 మంది విద్యార్థులకు ఆయన స్కూల్‌బ్యాగ్స్, వాటర్ బాటిల్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణాగౌడ్, మాజీ జడ్పీటీసీ సామెల్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ రవీందర్, సొసైటీ మాజీ చైర్మన్ సాయిలు పాల్గొన్నారు.

## రక్త దాన శిబిరం


పెద్ద కొడప్‌గల్‌లో శిబిరంలో రక్త దానం చేస్తున్న దాతలు

పెద్దకొడప్‌గల్, జనవరి 6 : మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం, పాత గ్రామ పంచాయతీ ఆవరణ లో సోమవారం సద్గురు నరేంద్రచార్య మహరాజ్ సంస్థాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామ ప్రజలు రక్తదానం చేసేందుకు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో సంస్థాన్ జిల్లా కన్వీనర్ సుశీల్ పాటిల్, మండల అధ్యక్షుడు మనోహర్ పాటిల్, సంస్థాన్ పీఠ్ సమిత్ అధ్యక్షుడు బాబూరావు ఇంగ్లే, పాండురంగ్, గంగారాం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి నెలా మందులు పంపిణీ చేయాలి

లింగంపేట, జనవరి 6: బీపీ, షుగర్ ఉన్న వారికి ప్రతి నెలా మందులు పంపిణీ చేయాలని నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ శిరీష సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు, ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా కో–ఆర్డినేటర్ సిద్ధిరామేశ్వర్, సూపర్‌వైజర్ ఫరీదా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే పక్కాగా నిర్వహించాలి

బిచ్కుంద, జనవరి 6 : ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా నిర్వహించాలని హైజింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పరిశీలించారు. ఆయనవెంట డీఈ గోపాల్, ఏఈ హన్మంతు, ఎంపీవో గోపాలకృష్ణ, క్యాదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

## రుద్రారంలో తొలగిన తాగునీటి సమస్య


రుద్రారం గ్రామంలో వేస్తున్న బోరు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 6: కొద్ది రోజులుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న రుద్రారం గ్రామస్తుల సమస్యను తొలగించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. సోమవారం మండలంలోని రుద్రారం గ్రామంలో ఆయన ఎమ్మెల్యే సొంత నిధులతో బోరు వేయించి గ్రామస్తుల తాగునీటి సమస్యను తొలగించినట్లు తెలిపారు. ఆయనవెంట మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాయకులు బోండ్ల సాయిలు, ఉషాగౌడ్, సత్యం, కృష్ణాగౌడ్ తదితరులున్నారు.

## ఏటీఎం సెంటర్ ప్రారంభం

గాంధారి, జనవరి 6: మండల కేంద్రంలోని ఎన్‌డీసీసీ బ్యాంకు ఆవరణలో ఏటీఎం కేంద్రాన్ని గాంధారి సింగిల్ విండో చైర్మన్ పెద్దబూరి సాయికుమార్, ఏజీఎం భీంరావు కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులతోపాటు, రైతుల సౌకర్యార్థం ఏటీఎం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రీపాల్‌రెడ్డి, సింగిల్ విండో సీఈవో గాండ్ల సాయిలు, విండో వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్ పాల్గొన్నారు.

భూమి లేకున్నా పట్టా పొందిన
## వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నాగిరెడ్డిపేట, జనవరి 6: పోచారం గ్రామంలో పట్టా భూమి లేకున్నా పట్టా పొందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ..సోమవారం మానవ హక్కుల సేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి శ్రీనివాస్‌రావు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పోచారం గ్రామానికి చెందిన ఇప్ప బాపూరావు సర్వే నంబర్ 287/అ/1/1లో ఖాతా నంబర్ 702లో 1.20 ఎకరాల భూమి పట్టా పొందినట్లు చెప్పారు. దానిపై బ్యాంకు రుణం, ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను పొందుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో విచారణ చేపట్టి తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

## తాగునీటి సమస్య తీర్చాలని వినతి

పెద్ద కొడప్‌గల్ 6 : పిట్లం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ తాగు నీటి సమస్య తీర్చాలని చిన్న కొడప్‌గల్ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. జాతీయ రహదారి 161కు ఆనుకొని ఉన్న కాలనీలో ఎనిమిది నెలలుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యను మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

## పట్టా భూమి నమోదు చేయాలని ఫిర్యాదు

లింగంపేట, జనవరి 6: తన వ్యవసాయ భూమిని పట్టదారు పాసుపుస్తకంలో నమోదు చేయాలని లింగంపేట గ్రామానికి చెందిన మంగళి రవి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని మెంగారం గ్రామ శివారులోని ఊర చెరువు కింద 54/ఇ4లో మూడు గుంటల వ్యవసాయ భూమి ఉన్నదని, సదరు భూమి వివరాలు ధరణి పట్టదారు పాసుపుస్తకంలో నమోదు కాలేదన్నారు. భూమి వివరాలు నమోదు చేయాలని కోరారు.